ఎట్టకేలకు మోక్షం...

విస్తరణ నిర్మాణ పనుల్లో నత్తే నయం

విశాలాంధ్ర - కురుపాం: తోటపల్లి-గుణుపూరు ప్రధాన రహదారిలో తోటపల్లి-కురుపాం రహదారి విస్తరణ నిర్మాణ పనులు పునః ప్రారంభం అయినందుకు కూటమి ప్రభుత్వం చూపిన చొరవకు సంతోష పడాలో ఆర్ అండ్ బి అధికారులు, గుత్తేదారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన సిసి కాలువలు, రహదారి నిర్మాణం నత్తనడకన సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేయాలో అర్థం కాని దుస్థితి. గత ప్రభుత్వం సకాలంలో బిల్లు విడుదల చేయక పోవడం ఓ కారణమైతే అధికారులు నిర్లక్ష్యం మరో కారణమని చెప్పుకోక తప్పనిసరి. సుమారు 38 కోట్ల రూపాయలు అంచనాలతో నాలుగేళ్లుగా కొనసాగుతున్న తోటపల్లి-కురుపాం పద్నాలుగు కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ దుస్థితికి కారణం ఏమనేది పక్కన పెడితే నిర్మాణ నిర్వహణ బాధ్యతను చూస్తున్నా రహదారి భవనాలు శాఖ అధికారులు పెచ్చు మీరిన నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడు తోంది. నిర్మాణ పనులు ప్రారంభం నుంచి నేటి వరకు సంబంధిత అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. విస్తరణలో ఒక్కో దగ్గర ఒక్కో విధంగా రహదారి కంటే ఎత్తున కాలువ నిర్మాణం, పర్యవేక్షణ, నాణ్యత ప్రమాణాలు పాటించటంలో ఉదాసీనత, రాజకీయ వత్తిడికి తలొగ్గడం ఇలా అనేక విమర్శలు ఉన్నాయి. కురుపాం మెయిన్ రోడ్డులో కాలువ నిర్మాణ రెండేళ్లుగా గాలికి వదిలేసి ప్రజలకు రోగాలు భారిన పడేసిన గుత్తేదారుపై శాఖాపరమైన చర్యలు శూన్యం. తాజాగా చేపడుతున్న సిసి రహదారి నిర్మాణం కూడా ఇరువైపులా పక్కా సిసి కాలువ నిర్మాణం పూర్తి చేయకుండా చేపట్టడం దానికి ఆర్ అండ్ బి కనీసం అభ్యంతరం చెప్పలేని దుస్థితిపై ప్రజలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రహదారి విస్తరణ పనులు ప్రారంభిం చడానికి చర్యలు తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేయాలో లేక అసంపూర్తిగా కాలువలు లేకుండా నత్తనడకన సాగుతున్న సిసి రహదారి నిర్మాణ పనులు కారణంగా జరుగుతున్న నష్టంపై ఏవిధంగా అభివర్ణించాలో అర్థంకాని పరిస్థితి. రాష్ట్ర విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చొరవ చూపాలని దీర్ఘకాలిక సమస్యగా ఉన్న రహదారి విస్తరణ పనులు పూర్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు జరుగుతున్న సిసి రహదారి నిర్మాణంలో పనులు నత్తనడకన చేస్తుండగా ప్రక్క ప్రక్క జాయింట్ కలిపేందుకు ఏర్పాటు చేసిన 20ఎంఎం గజాలు వాహనాలకు, ప్రజలకు తీవ్రంగా ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ప్రత్యామ్నయ రహదారి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ంగా అవస్థలు పడుతున్నారు. వాహనాలు ఎదు రైందని గజాల వైపు జరిగితే టైర్లు నాశమైపో తున్నాయి. ఫలితంగా వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడుతుంది. రహదారి మళ్లింపు కోసం పోలీసు శాఖ సహాయం తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కాలువలు, సిసి రహదారి నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేయా లని కోరుతున్నారు. కురుపాం మెయిన్ రోడ్డులో నాలుగు సంవత్సరాలుగా ప్రజలు పడిన కష్టాలు వర్ణణాతీతం. కాలువ నిర్మాణం ఇష్టారాజ్యంగా చేపట్టడం, సగం నిర్మాణం అయిన పనులను అసలు ప్రారంభించడానికి ముందుకు రాకపోవడంతో మురుగు నీరు రహదారిపైనే ప్రవహిస్తుంది. ఆర్ అండ్ బి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతున్నారు.

5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

విశాలాంధ్ర - పార్వతీపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 5వ తేదీ శనివారం డా: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక సౌందర్య థియేటర్ జంక్షన్ వద్ద ఉన్న డా.బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతం 10 గంటలకు సమావేశం జరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమానికి ఎస్ సి నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - బలిజిపేట: బలిజిపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 24 పంచాయతీలకు అప్లికేషన్ అభ్యర్థులు ఆన్లైన్లో చేసుకున్న సుమారుగా 800 కాగా సుమారు 650 హాజరై తగు పత్రాలు ధ్రువకరణ పత్రాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీఎస్ నగేష్, పిఓపిఆర్డి పుష్పారావు, వివిధ అధికారులు, మేనేజర్లు, సచివాలయం సిబ్బంది సెక్రటరీలు పాల్గొన్నారు.

మక్కువ: మండలంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ కార్పొరేషన్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 326 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూకు 276 హాజరయ్యారని ఎంపీడీవో డిడి స్వరూప రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్కువ జడ్పిటిసి మావుడి శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్, ఏపీజీవీబీ మేనేజర్లు, పిఓపిఆర్డి దేవకుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోని కొదమ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగుతుందని విద్యుత్ శాఖ ఎఈ బి.శంకరరావు తెలిపారు. పాలకొండ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గోపాలకృష్ణ ఆదేశాల మేరకు 33 కె.వి విద్యుత్ లైన్ ఆనుకొని ఉన్న చెట్లను చెట్ల కొమ్మలను ఆనుకొని ఉన్న చెట్లను కటింగ్ చేయనున్నారని దీనివలన ఉదయం 8. గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగనుందన్నారు.

ఎన్యుమరేటర్‌లకు శిక్షణ

విశాలాంధ్ర - సీతంపేట: వెలుగు ఆధ్వర్యంలో 2025- 26,ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళిక తయారు చేసే విధానం సంఘం, గ్రామ సంఘం మండల నిధుల సమీకరణ ఏ విధంగా చేయాలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో 1252 సంఘాలకు 215 మంది కి ఎన్యూమరేటర్‌లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. 6వ తేదీ నుంచి చిన్న సంఘాలు, గ్రామ సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకొని వార్షిక ప్రణాళిక తయారు చేస్తారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఎం ఆర్‌వి రమణ, ఏపీఎంస్ కమలాకుమారి, పార్వతీ, లక్ష్మి సింహాచలం డిపిఎం ఐబి, ఎల్ హెచ్ ఎ పి యం,సీసీలు వివోఏలు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ రోడ్డు సదుపాయాలు కల్పిస్తాం

ప్రభుత్వ విప్ జగదీశ్వరి

విశాలాంధ్ర - కొమరాడ: నియోజకవర్గంలో ప్రతి గ్రామాలకు రోడ్డు సదుపాయాలు కనిపిస్తామని ప్రజల అవసరాలు అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. గురువారం మండలంలో జరిగిన పలు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శంకుస్థాపనలు చేశారు. ముందుగా నాగవల్లి అవల ఉన్న గిరిజన పంచాయతీలకు గుణద తీలేసు పంచాయతీలో, దిగువ గుణద నుండి, ఖిన్నిడి, ఎగువ గుణద నుండి సవర గుణద గ్రామాలకు రూ.4కోట్లు 10 లక్షలతో నిర్మాణం జరిగిన బీటీ రహదారి ప్రారంభించారు. అనంతరం ఉలిపిరి వలస గ్రామంలో ఉన్నత పాఠశాల చుట్టూ 12 లక్షలతో నిర్మాణం చేసిన ప్రహరీని ప్రారంభించారు. ఉలిపిరి ఆశ్రమ పాఠశాలకు రూ.20 లక్షలతో మంజూరు అయిన స్కూల్ ప్రహరీకి శంకుస్థాపన చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో అందుకే పరిశీలన చేశారు. విద్యార్థులు చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం మధ్యాహ్నం నుంచి గునానపురం గ్రామంలో రూ.14 లక్షలతో నిర్మాణం చేసిన సీసీ రహదారి ప్రారంభించి గ్రామంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.శేఖర్ పాత్రుడు, ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావు, ఇన్‌చార్జ్ తహశీల్దార్ కే.శివయ్య, టిడిపి రైట్ సంఘం అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, పి.వెంకట్ నాయుడు, ఎస్టీ సెల్ నాయకులు తమ్మయ్య, జనసేన కోఆర్డినేటర్ కే.మల్లేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేసి, కరెంట్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు వేసే స్మార్ట్ మీటర్లపై ప్రజలంతా పోరాడాలని సీపీఎం పార్వతీపురం పట్టణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలనే గోడపత్రికలను గురువారం పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బి.వి.రమణ, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భారాలు వేయబోమని చెప్పి ప్రజలను నమ్మించి నేడు అధికారంలోకి వచ్చాక బాదుడే బాదుడుగా అన్ని రకాల నిత్యావసర సరుకులు ధరలు పెంచివేసేలా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతున్న ప్రజలపై సెల్ ఫోను రీఛార్జ్ వలే స్మార్ట్ కరెంటు మీటర్లు ఇళ్లకు ఏర్పాటు చేసి మరింత ఆర్థిక భారాలు వేసే ప్రయత్నం చేపడుతుందని ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, వి.రాజశేఖర్, వెన్నెల చిన్నంనాయుడు పాల్గొన్నారు.

భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వే

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వేను పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని, దీని మూలంగా రైతుకి, రైతుకి మధ్య సరిహద్దు సమస్యలు పరిష్కారం అవుతాయని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో జరుగుతున్న రెండవ విడత రీసర్వే అవగాహన ర్యాలీలో పీఓ భాగస్వామ్యమై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతులకు ముందుగా నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో ఖచ్చితమైన హద్దులను నిర్ణయించడం జరుగుతుందని అన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో తహశీల్దార్, ఉప తహశీల్దార్, మండల సర్వేయర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఇతర అధికారులు, గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

దారి లేక డోలీమోతలే శరణ్యం..!

విశాలాంధ్ర - సాలూరు: మండలంలో జిల్లేడువలస పంచాయతీ బొడ్డపాడు గ్రామానికి చెందిన సీదరపు నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం అందించేందుకు సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించటానికి కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. బొడ్డపాడు గ్రామానికి సురక్షిత రహదారి సదుపాయం లేకపోవడంతో జిల్లేడువలస గ్రామం వరకు రావాలంటే మూడు కిలోమీటర్ల మేర కాలినడక తప్ప ప్రత్యామ్నాయం లేని పరిస్థితి. గురువారం ఉదయం నాగేశ్వరరావు అనారోగ్య తీవ్రత అధికం కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సహాయంతో జిల్లేడువలస గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్లు డోలీతో మోసుకుంటూ నాగేశ్వరరావును తీసుకువచ్చారు. అక్కడనుండి ఆటోలో సాలూరు తరలించి చికిత్స కోసం ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. ప్రాథమిక వైద్యం అందించిన పిదప మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వాలు ఎన్నిమారినా పాలకుల ప్రగల్భాలు తప్ప గిరిజన బ్రతుకులలో మార్పు మాత్రం రావటం లేదని సిపిఎం నాయకులు మర్రి శ్రీనివాసరావు అన్నారు. గిరిజనులకు మౌలిక వసతుల కల్పించడంలో ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమవుతున్నాయన్నారు. ఇప్పటికీ గిరిశిఖర గ్రామాల ప్రజలు రహదారి సదుపాయం లేక నానా అవస్థలు పడుతున్నారని గిరిజన సంఘం నాయకులు సీదరపు అప్పారావు వాపోయారు. గిరిజన సంక్షేమ శాఖామంత్రి స్థానిక ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి గిరిశిఖర గ్రామాలకు రహదారి సదుపాయం కల్పిస్తామని, డోలీ మోత లేకుండా చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికి అవి కార్యరూపం దాల్చకపోవడం గిరిజనులపట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శమన్నారు. కరడవలస నుండి జిల్లేడువలసకు సుమారు 6 కిలోమీటర్ల మేర బీటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని లేని ఎడల ఆందోళన చేపడతామని వారన్నారు....

కూల్చిన స్థలంలో యధావిధిగా నిర్మాణం

కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు
అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాస్తున్న వైనం
గిరిజనేతర కట్టడాలకు గిరిజనులు బినామీలు
అక్రమ కట్టడాలపై జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర - పాడేరు: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులు శాశ్వత గృహాలు, షాపులు, రెస్టారెంట్లు తదితర వాటికి నిర్మాణాలు చేపట్టకూడదని 1/70 భూ బదలాయింపు చట్టం చెప్తున్నప్పటికీ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న గిరిజనులు గిరిజనేతరులకు బినామీలుగా వ్యవహరిస్తూ గిరిజన ప్రాంతం హక్కులు చట్టాలకు భంగం కలిగించే విధంగా వ్యవహరి స్తున్నారు. హక్కులు, చట్టాలను కాపాడాల్సిన అధికారులు, రాజకీయ నాయకులు కాసులకు కక్కుర్తి పడి అటువైపు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. పట్టణంలో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. అల్లూరి జిల్లా పాడేరు పట్టణ నడిబొడ్డున డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయానికి ఆనుకొని ఉన్న పంచాయతీ స్థలాన్ని ఓ గిరిజనేతర మహిళ గతంలో రెవెన్యూ అధికారులు కూల్చిన స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తున్నా సంబంధిత అధికారులకు చలనం లేదు. గతంలో ఇదే స్థలానికి నిర్మాణం చేస్తున్న సందర్భంలో నేరుగా గిరిజన సంఘాలు జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయగా రెవెన్యూ, పంచాయతీ అధికార్లు జెసిబి తీసుకొని వెళ్ళి పిల్లర్లు పడగొట్టారు. అక్కడితో ఆగిపోయింది అనుకొంటే.. కొత్త ఎత్తుగడ వేసి ఓ గిరిజన మహిళను రంగంలో దించి.. ఇ స్థలం నాదని గిరిజనేతరులది కాదని నేనే నిర్మిస్తానని ఎవరు అడ్డుకోవదని చెప్పించడం కోసమేరువు... అయితే రెవెన్యూ పంచాయతీ అధికారులు కూల్చిన స్థలం మళ్ళీ యధావిధిగా నిర్మాణం జరగడం వల్ల రెవెన్యూ పంచాయతీ అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఈ నిర్మాణం కొనసాగిస్తున్నారని బహిరంగంగానే గిరిజన ప్రజలు మాట్లాడుకుంటున్న పరిస్థితి నేడు నెలకొంది. ఓ వైపు పీసా కమిటీ మరోవైపు రెవెన్యూ పంచాయతీ అధికారులు అమ్ముడుపోయారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పట్టణంలో చాలా చోట్ల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పంచాయితీ రెవెన్యూ పీసా కమిటీ అధికారులకు తెలిసినా ఆ నిర్మాణాలు నిలుపుదల చేయకుండా తూతూమంత్రంగా నోటీసులు జారీ చేస్తూ కాసులు తీసుకొని నిర్మాణాలు యధావిధిగా కొనసాగిస్తున్నారని విమర్శలు కూడా లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు అక్రమ కట్టడాలపై దృష్టి పెట్టి పాడేరు పట్టణంలో బినామీ వ్యవస్థకు అడ్డుకట్ట, గిరిజనేతరులు శాశ్వత గృహాలు షాపులు రెస్టారెంట్లుపై నోటీసులు జారీ చేసి ఎల్ టి ఆర్ కేసులు నమోదు చేయాలని పలు ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - అరకులోయ: అరకులోయ మండల కేంద్రంలోని శారద నికేతన్ పాఠశాలలో శారద ట్రస్టు ఆధ్వర్యంలో కృష్ణా మేటర్నటీ నర్సింగ్ హెూమ్, కృష్ణా చిల్డ్రన్స్ హాస్పటల్ విశాఖపట్నం సంయుక్తంగా బిఎల్ నారాయణ, జనరల్ మేనేజింగ్ డైరెక్టర్ వరలక్ష్మి సహకారంతో గురువారం చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ మెడికల్ క్యాంపునకు విద్యార్థులు, గిరిజనులు సుమారు 500 పైగా హాజరయ్యారు. వారికి డాక్టర్ బి.తేజస్విని, డాక్టర్ వై.దివ్య, డాక్టర్ పైల సంధ్య వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యాధులతో బాధ పడుతున్న వారిని బిపి, షుగర్, గైనిక్ చెకప్, రక్త పరీక్ష చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి గిరిజన కుటుంబీలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా వేదిక నాయకురాలు జె.రాజ్యలక్ష్మి, శారద ట్రస్ట్ సభ్యులు రత్నం, ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.వి.జయ, శారదా నికేతన్ ప్రిన్సిపల్ చిరంజీవి, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భిన్న వాతావరణం

ఉదయం మంచు.. మధ్యాహ్నం ఉక్కబోత..సాయంత్రం వర్షం

విశాలాంధ్ర - జి.మాడుగుల: మన్యంలో గత కొద్ది రోజులుగా భిన్న వాతావరణం నెలకొంది. ఇటీవల నుంచి ఉదయం 8గంటల వరకు మంచు కురిసి చలి తీవ్రతతో పాటు దట్టంగా పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి ఉక్కపోతతో జనజీవనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఆ తరువాత ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా కారు మబ్బులు కుమ్మరించి పలు చోట్ల తేలికపాటి జల్లు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రెండవ పంట రబీ సాగు కాఫీ మిరియాలు, మామిడి, పనస పూతలకు అనుకూలమని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఇలా వారానికి ఒక పర్యాయం వరుణుడు కరుణిస్తే వ్యవసాయం మూడు పువ్వులు ఆరు కాయాలు అన్న సందంనంగా లాభసాటిగా ఉంటుందని రైతులు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర - జీకే వీధి: ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పదకొండు అంకెల గుర్తింపు సంఖ్య వస్తుందని దానికి అనుగుణంగానే వ్యవసాయ అనుబంధ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో నమోదు చేసేందుకు వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు విధిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. రైతులు నాణ్యమైన ఆహారవంతమైన ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆహార పదార్థాలు పండించాలని సూచించారు. రీ సర్వే జరిగే గ్రామాలలో రైతులు విధిగా పాల్గొని సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదన్, ఆర్ఐ మహదేవ్, మండల సర్వేయర్ శ్రీను, విఆర్వోలు, వ్యవసాయ సహాయకులు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

దారకొండలో భారీ వర్షం

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండ పంచాయితీలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత మూడు రోజులుగా మేఘాలు ఉన్నప్పటికీ మధ్యాహ్నం 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఎండవేడికి వఋద్దులు పిల్లలు ఇండ్లకే పరిమితమవుతున్నారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో పిడుగులతో కూడిన వర్షం సుమారు 2 గంటలు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో వేడిమి నుండి ప్రాంతీయులు ఉపశమనం పొందారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - చింతపల్లి: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. స్థానిక పంచాయతీ కేంద్రంలో ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా స్థానిక పంచాయతీ కేంద్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత, ఎంపీడీవో శ్రీనివాసరావులు గ్రామంలోని అన్ని దుకాణాలకు ప్లాస్టిక్ నిషేధంపై నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్పత్తుల తయారీపై శిక్షణ

విశాలాంధ్ర - కొయ్యూరు: మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్పోర్ట్ హైవేస్ వారు సేకరించిన జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డుకి ఆనుకొని రహదారిలో షాపులు ఇల్లు భూములు కోల్పోయి నిర్వాసితులుగా ఉన్న లబ్ధిదారులకు రానున్న రోజుల్లో వారు స్వయంగా జీవనోపాధి పొందేందుకు వివిధ ఉత్పత్తులు తయారు చేసుకునేందుకు మార్కెటింగ్ చేసుకునేందుకు తగిన శిక్షణ ఇస్తున్నట్లు ఆర్ అండ్ ఆర్ ఎక్సెక్ట్ చిరంజీవి తెలిపారు ఈ శిక్షణ ద్వారా వారికి ఆదాయం మరింత మెరుగుపడుతుందన్నారు ఈ శిక్షణ కార్యక్రమంలో జనరల్ ఎపెక్స్ అరుణకుమారి ఎన్జీవో సభ్యులతో పాటు కాకరపాడు పిట్టచలం నడింపాలెం చింతలపూడి రావణ పల్లి తోటలూరు గ్రామాలతో పాటు రంపుల ఘాట్టి రోడ్డు వరకు గల గ్రామాల నుండి 110 మంది జాతీయ రహదారి నిర్వాసితులు పాల్గొన్నారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా చివరి రోజు వెలుగు డిపార్ట్మెంట్ నుండి ఏపీఎం గారు పాల్గొని సభ్యులకు మరింత మెరుగైన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - జి.మాడుగుల: మన్యం జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఏపీ టూరిజం సభ్యుడు కిల్లు రమేశ్‌నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రసిద్ధి గాంచిన తారాబు జలపాతం, సృజనకోట ఐలాండ్, వంజంగి హిల్స్, దల్లాపల్లి వ్యూపాయింట్, కొత్తపల్లి జలపాతం, లంబసింగి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రూ.456 కోట్లతో రోడ్లు అభివృద్ధి, నిర్మాణాలు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : జిల్లాలో మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించి డోలీ మోతల రహితంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. రూ.456 కోట్లతో రహదారులు అభివృద్ధి, కొత్త రోడ్లు నిర్మాణాలు, 26 వంతెనల నిర్మాణాలను మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి, ఉపాధికల్పన, మలేరియా నివారణ చర్యలు, ముందస్తు చర్యలను వేసవిలో తాగు నీటి సమస్యల పరిష్కారానికి చేపట్టిన వివరించారు. 1కోటి 48 మందికి ఉపాధి పనులు కల్పించడానికి లక్ష్యంగా నిర్దేశించి 1 కోటి 61 లక్షల మందికి పని కల్పించి ఉపాధి పనుల్లో జిల్లా అగ్రస్థానం లో నిలపడం జరిగిందన్నారు. 2030 నాటికి మలేరియా రహిత జిల్లాగా ప్రకటించడానికి ప్రణాళిలు తయారు చేసామ న్నారు. ఈ ఏడాది 3 లక్షల 50 వేల దోమ తెరలు పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టామ న్నారు. లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరిం చడానికి రాష్ట్ర ముఖ్య మంత్రి ఆదేశించారన్నారు. ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో నీడి తోటలు పెంచడానికి అవసరమైన ప్రక్రియ జరుగుతోం దన్నారు. ఈ వేసవి లో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఉన్న మూడు ఐటిడి ఏలలో టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసామని తాగునీటి సమస్యలపై సమాచారం అందిస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను ప్రతి రోజు స్వయంగా పర్యవేక్షిస్తామని అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో 1800 425 6828, పాడేరు ఐటిడిఏలో 08935250833, రంపచోడవరం ఐటిడిఏ 619004 252 123 చింతూరు ఐటిడి ఏ లో 81215 29228 సమాచార కేంద్రాల ఫోను నంబర్లకు సమాచారం అందిస్తే 24 గం టల్లో తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కురుపాం: విజయవాడలో ఈనెల 5వ తేదీన జరిగే వి.ఆర్.ఎ.ల. రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని మన్యం జిల్లా వీఆర్‌ఏ సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వరరావు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఒక రూపాయి కుడా వీఆర్‌ఏలకు జీతం పెంచలేదని, జీతం పెంచకపోగా గత ప్రభుత్వం తిరిగి వి.ఆర్.ఎ.ల వద్ద నుండి డి.ఎ. రికవరి చేశారన్నారు. పేస్కేల్, ప్రమోషన్లు, అటెండర్, నైట్ వాచ్‌మన్, డ్రైవర్ పదోన్నతులు కల్పించాలని, వన్-టైమ్ సెటిల్మెంట్‌గా నామిని వి.ఆర్.ఎ.లను వి.ఆర్.ఎ.లుగా గుర్తించాలన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బెలగాం: నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్.సి.సి.పి.ఎ) దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసనలు తెలపాలని ఎ.ఐ.పి.ఆర్.పి.ఎ పిలుపులో భాగంగా గురువారం పార్వతీపురం పోస్టల్ ఉద్యోగులు పెద పోస్టు ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పార్వతీపురం డివిజన్ పోస్టల్ పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి చలం మాట్లాడుతూ గత నెల 25వ తేదీన కేంద్ర ప్రభుత్వం పెన్షన్ రూల్స్‌లో మార్పు చేసి, బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకున్నారని రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకోవాలని ఈ సవరణలు పెన్షన్ విధానంలో ముఖ్యమైన మార్పులకు దారి తీస్తున్నాయన్నారు. పెన్షన్ రూల్స్ 1976, 2021 ఎక్స్ట్రాడినరీ పెన్షన్ రూల్స్ 2023లో మార్పులు తీసుకొచ్చారని, పే కమిషన్ లాభాలు భవిష్యత్‌కు మాత్రమే పే కమిషన్ సిఫార్సులు అమలైన తేదీ తరువాత పదవీ విరమణ పొందిన ఉద్యోగులకే వర్తించనున్నాయని, ఆ తేదీకి ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు పెరిగిన లాభాలు వర్తించవని తెలిపారు. పే కమిషన్ సిఫార్సులను ఎప్పుడు, ఎలా అమలు చేయాలన్న దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉంటుందని, దీని ద్వారా పెన్షన్ హక్కులు ఎవరికీ వర్తించాలో ప్రభుత్వం నిర్ణయించగలదన్నారు. ఈ చట్టం ద్వారా తేదీ 01.01.26కు ముందు పదవీ విరమణ చేసిన వారు మరియు తదుపరి పదవి చేసిన వారుగా పెన్షనర్లను రెండు గ్రూపులుగా విభజిస్తున్నారని, ఈ చట్టం ద్వారా వేతన సంఘం అమలు చేసిన తేదీ లేదా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన తేదీ ప్రకారం పదవి విరమణ చేసిన వారికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందని మిగిలినవారికి ఆర్థిక లబ్ధి రాదని తెలిపారు. లోక్ సభలో ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా విపక్షాలు ఈ సవరణలకు వ్యతిరేకంగా వాక్‌ఔట్ చేశాయని ఈ చర్యను బ్యాక్‌డోర్ చట్టం ద్వారా మిలియన్ల మంది పెన్షనర్లను అన్యాయంగా దూరం పెట్టడమేనని విమర్శించారు. సుప్రీంకోర్టు గతంలో పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా వేరుచేయడం అసమంజసమని తీర్పు చెప్పిందని అయిన ప్పటికీ, ఈ బిల్లు ద్వారా ప్రభుత్వం ఆ తీర్పును మూల్యహీనంగా చేస్తూ, పెన్షన్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా నిర్ణయించడానికి బలం కల్పిస్తోందని, ఇది ఆరవ పే కమిషన్ కాలంలో ఉన్న విధానాన్ని పోలి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎ.పుష్పనాథం, ఓ.రాములు, ఎస్.ఆర్.కె.జనాదేవ్, కె. అప్పారావు అధిక సంఖ్యలో రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్య సాగు - నేలతల్లికి బాగు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో వ్యవసాయశాఖ - రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఎపిసిఎన్ఎఫ్) ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక 2025-2026 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ అనుబంధ శాఖలు, వెలుగు శాఖల అధికారులతో ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఆర్‌టిఓ హేమ సుందర్, ఆర్‌టిఎల్ కె.ప్రకాషరావు, పిఏఓ కె.శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్, ఉద్యాన అధికారి ప్రత్యూష భాను, వెలుగు ఏపిఎం తేలు శ్రీరాములు, డిపివి ఎం.మానస, ఎన్ఎఫ్ఎ (మార్కెటింగ్) వై.తిరుపతి, ఎపిసి ఎన్ ఎఫ్ (మండల ఇంచార్జ్) ఎన్.గంగరాజు, ఎ పి సి ఎన్ ఎఫ్ (ఎం టి) వై. శ్రీరాములు , ఎం ఎస్ ఓ బి (ప్రెసిడెంట్) జి. ప్రమీల, ఎం ఎస్ ఓ బి (వైస్ ప్రెసిడెంట్) ఎ. శ్రీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ/ఉద్యాన సహాయకులు, వెలుగు వి ఓ ఏ లు మరియు ఎ పి సి ఎన్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజనల్ టీం మాట్లాడుతూ బహుళ పంటలవిధానాన్ని అమలు చేసుకోవాలని తెలిపారు. అలానే నవధాన్య సాగుకు వెలుగు సంఘంనుండి ప్రకృతివ్యవసాయ సిబ్బంది అవసరమగు సహాయం తీసుకోవాలని తెలియచేశారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ గ్రామస్థాయిలో వ్యవసాయ, వెలుగుశాఖల మధ్య సమన్వయం పాటిస్తూ రైతులకు ప్రకృతి వ్యవసాయం అలవాటు చేస్తూ రైతుల నికర ఆదాయం పెరిగేటట్టు చేయాలని తెలిపారు. ఉద్యానఅధికారి మాట్లాడుతూ

ఉద్యానపంటలలో జీడి మరియు మామిడి పంటలు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించడం వలన అధిక ఉపయోగం ఉంటుందని తెలియచేశారు. ఎ పి సి ఎన్ ఎఫ్ అధికారులు మాట్లాడుతూ పిఎండిఎస్ (నవధాన్య) (ప్రీ మొన్సూన్ డ్రై సోయింగ్) పద్దతి గురించి వివరించారు. ఈ సందర్భంగా 30రకాల విత్తనాలు సుమారు 12 కేజీలు తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పొలంలో జల్లుకొని 45 రోజుల తర్వాత భూమిలో దున్నుకోవడం వలన భూమిలో అధిక స్థాయిలో సూక్ష్మజీవులు పెరిగి నేలఆరోగ్యం బాగు అవుతుందని అన్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించడమే హైందవ సైన్య సిద్ధాంతం

విశాలాంధ్ర - చింతపల్లి/ జి.మాడుగుల: మన్య ప్రాంతంలో హైందవ సంప్రదాయాన్ని అభివృద్ధి పరచేందుకు అన్ని విధాల తమ సహాయ, సహకారాలు అందజేస్తామని హైందవ సైన్య వ్యవస్థాపకులు పెనుగొండ దుర్గా ప్రసాద్ అన్నారు. శ్రీ అంజనాద్రి వైద్య రామ లింగేశ్వర స్వామి ఆశ్రమంలో మఠాధిపతి శ్రీ సిద్ధి సింహాచలం గురూజీ ఆధ్వర్యంలో గంధం పట్టాభి రామారావు ఆర్థిక సహాయంతో ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డీవీడీ ప్రసాద్‌ల సమన్వయంతో జీ మాడుగుల మండలం గుదలం వీధిలో ఘనంగా హెూమం కార్యక్రమం నిర్వహించారు.అనంతరం గంధం పట్టాభి రామారావు ఆర్థిక సహాయంతో అందించిన శివ లింగ ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడమే హైందవ సైన్య సిద్ధాంతమన్నారు. బడికి వెళ్లి చదువుకున్న వారు ఏ విధంగా తమ జీవితాన్ని బంగారు భవిష్యత్తుగా మార్చుకుంటారో అదేవిధంగా గుడికి (ఆలయాలకు) వెళ్లిన వ్యక్తులు గుణవంతులు అవుతారన్నారు. ప్రతి వ్యక్తిలో భక్తి భావం ఉండాలన్నారు. అంజనాద్రి వైద్య లింగేశ్వర స్వామి ఆశ్రమానికి నవగ్రహ మండపాన్ని ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా భక్తులకు దుర్గాప్రసాద్ హామీ ఇచ్చారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన పి దుర్గాప్రసాద్, డివిడి ప్రసాద్, ఎం.మంగ తల్లి, పి.చిన్న తల్లి, సురేష్, బాబురావు, శోభన్ రాజ్‌లతోపాటు అంజనాద్రి ఆలయ మఠాధిపతి శ్రీ సిద్ధి సింహాచలం గురూజీని భక్తులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఎట్టకేలకు రహదారికి అడ్డంగా కూలిన భారీ వృక్షం తొలగింపు

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - చింతపల్లి: ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్రబండ నుంచి శరభన్నపాలెం వెళ్లే ప్రధాన రహదారిలోని తప్పల మామిడి గ్రామ సమీపంలో కూలిన భారీ వృక్షాన్ని ఎట్టకేలకు తొలగించారు. ఆ వృక్షం రహదారికి అడ్డంగా కూలడం వలన ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎర్రబొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సేగ్గే సత్తిబాబు పేరిట విశాలాంధ్ర లో వచ్చిన కథనానికి స్పందన వచ్చింది. శరభన్నపాలెం మీదుగా కేడీపేట వెళ్లేందుకు దగ్గర దారిగా ఉండే ఎర్ర బొమ్మల పంచాయితీ ఎర్రబంద, తప్పల మామిడి, శరబన్నపాలెం మీదుగా కేడీపేట వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో ఉగాది రోజున ఆదివారం భారీ వృక్షం నేలకూలిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆ మార్గము గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారీ వృక్షం కావడంతో కూలీలు, చిన్న చిన్న మిషన్ లతో ఆ వృక్షాన్ని తొలగించే అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న తరుణంలో పత్రికలలో వచ్చిన కథనానికి స్పందించిన అటవీశాఖ అధికారులు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులతో

కలసి ఎట్టకేలకు కూలిన వృక్షాన్ని అతి కష్టం మీద తొలగించారు. దీంతో ఆ రహదారి మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు. పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించి భారీ వృక్షాన్ని తొలగించేందుకు సహకరించిన అటవీ శాఖ అధికారులకు, గ్రామస్తులకు ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు కృతజ్ఞతలు తెలిపారు..

ద్విచక్ర వాహనం బోల్తా: యువకుడు మృతి

విశాలాంధ్ర జీకే వీధి: ద్విచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ కోడి సింగి గ్రామానికి చెందిన కంకిపాటి భోదేశ్వరరావు (32) సొంత పనులపై గురువారం ఇంటి నుంచి బయటికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వెళ్తుండగా లక్కవరపేట దేవరాపల్లి రహదారి మధ్యలో బైకు అదుపుతప్పి పల్టీ కొట్టడంతో తలకి బలమైన గాయం తగిలి సంఘటన ప్రదేశంలో గురువారం రాత్రి మృత్యువాతకు గురయ్యారు. సంఘటన జరిగినప్పుడు ఎవరు అటువైపు నుంచి వెళ్లకపోవడంతో సంఘటన జరిగినట్లు వారి కుటుంబ సభ్యులకి గాని ఇతరులకు గాని తెలియ రాలేదు. శుక్రవారం ఉదయం అదే రహదారి గుండా వెళ్తున్న వ్యక్తులు సంఘటన జరిగినట్లు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు బంధువులు హుటా హుటీన సంఘటన ప్రదేశం

చేరుకొని పరిశీలించగా ద్విచక్ర వాహనం పొదై ఉంది. బోదేశ్వరరావు మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే జీకే వీధి పోలీసులకి సమాచారం చేరవేశారు. ఈ క్రమంలో సీఐ వరప్రసాద్ సిబ్బంది సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని బైకు బోల్తా కొట్టిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ విలేకరులతో మాట్లాడుతూ అతివేగంగా ద్విచక్ర వాహనం నడపడం వల్లే ప్రధానంగా ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు. బోదేశ్వరరావుకి భార్య 3 పిల్లలు ఉన్నారని నిరుపేద కుటుంబానికి చెందిన వారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహానికి ప్రజా ప్రతినిధులు సమక్షంలో పంచనామా చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. బీద కుటుంబం కావడంతో పోలీసు నుంచి అంత్యక్రియ నిమిత్తం కొంత ఆర్థిక సహాయాన్ని అందజేసామన్నారు. అదేవిధంగా దేవరపల్లి సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీటీసీ కంకిపాటి రామారావులకు అంత్యక్రియలు నిమిత్తం ఆర్థిక సహాయం చేయాలని సూచించామని తెలిపారు.

శ్రీరామ నవమి ముహూర్తం రాట

విశాలాంధ్ర జీకే వీధి: గూడెం కొత్త వీది మండలం జి కే వీధిలో శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకొని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ముహూర్తపు రాట వేశారు. ఈ ఏడాది అత్యంత వైభవంగా శ్రీరామ వేడుకలు నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సంప్రదాయబద్ధంగా స్వామివారిని ఊరేగింపు నిర్వహించి సీతారాముల కళ్యాణం జరిపించనున్నారు. ఈ వేడుకలు నాలుగు రోజులపాటు నిర్వహించడానికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గొర్ల వీర వెంకట్, గౌరవ అధ్యక్షురాలు ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, సతర సమ ఫౌండేషన్ జిల్లా సహాయ మహిళా కన్వీనర్ లావణ్య, తెదేపా మండల అధ్యక్షుడు ముక్కల రమేష్, కమిటీ ప్రతినిధులు శోభన్, సుర కత్తి రాము, నాదేల రాజారత్నం భక్తుల రాజు పాల్గొన్నారు.

ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగవంశం శంకర్రావు చీపురుపల్లి సింహాచలం, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ కెవిపి రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేసిందని సమ్మెలో భాగంగా అప్పటి ప్రభుత్వం ప్రత్యేక జీవోలు విడుదల చేసిందని అవి నేటి వరకు అమలు చేయలేదని అన్నారు. పారిశుధ్య కార్మికులకు 62 సంవత్సరములు వయస్సు వయోపరిమితి పెంచాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని రిటైర్ అయిపోయిన పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించి పనిలో పెట్టుకోవాలని అన్నారు. ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలు పెట్టే ఆలోచన మానుకోవాలని కొనసాగించాలని లేదా ఆప్కాసు విధాన కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని అన్నారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా పని కుదించాలని కార్మికుల సంఖ్య పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగవంశం మల్లేష్, మామిడి శివ, టీ.శ్రీకాంత్, బంగారు రాజేష్, మామిడి శివ సాయి, పి.జాను, పిప్పలమ్మ, ఈ.ఎల్లమ్మ, జై.గౌరీ, బి.రవి, బి.కాసి, టీ.ప్రసాదు, జి.గంగులు, ఎన్.శ్రీను కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - బలిజిపేట: గ్రామాలలో పరిశుభ్రతతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్మాణం జరిగాయని, ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ నిరుపయోగంగా ఈ కేంద్రాలు దర్శనమిస్తున్నాయని సిపిఎం పార్టీ నాయకులు యామల మన్మధరావు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి తడి పొడి చెత్తలను వేరుచేసి ఎరువుగా తయారు చేసి వాటి వలన వచ్చే ఆదాయం గ్రామాలకు ఉపయోగ పడుతుందని ప్రభుత్వం ఆశయమని

తెలిపారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వలన సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నావని తెలిపారు. బలిజిపేట మండలంలో 21 పంచాయతీ గ్రామాలలో సంపద కేంద్రాలు నిర్మాణం పూర్తయ్యాయని, ఏ సంపద కేంద్రాలలో చెత్తను సేకరించటం లేదన్నారు. అజ్జాడ, నారం నాయుడు వలస, పెద్దింపేట మూడు గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలు నిర్మాణం జరగలేదన్నారు.

ప్రజల భాగస్వామ్యం కీలకం: డీపీఓ

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : గ్రామస్థాయిలో పారిశుధ్యం మెరుగుపడాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ముఖ్యంగా ప్రతి మహిళ చైతన్యవంతం కావాలని డిపిఓ టి. కొండలరావు అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరించినందుకు అంబాసిడర్లు ప్రతి ఇంటికి వస్తున్నారా లేక విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్నారా అలాగే ప్రభుత్వం నుంచి ఎల్.వి.ఆర్.ఎస్ ఫోన్లు ఏమైనా మహిళలకు వస్తున్నాయా అన్న దానిపై ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. మండలంలోని కృష్ణపల్లి పంచాయతీలో ఉదయాన్నే డిపిఓ కొండలరావు స్థానిక మండల పరిషత్ పిఓపిఆర్డి జివి

రమణమూర్తితో కలసి పర్యటించారు. గ్రామంలో గల ప్రతి ఇంటికి వెళ్లి మహిళలతో మాట్లాడి పారిశుధ్యం ఎలా ఉంది..? పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారా... లేదా అన్న దానిపై ఆరా తీశారు. చెత్త సేకరణకు వచ్చే సిబ్బందికి సహకరించాలని, ఆరుబయట వ్యర్థాలు వేయడం మూలంగానే రోగాలు ప్రబలుతాయని అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎల్.వి.ఆర్.ఎస్ ఫోన్ కాల్ కు మహిళలు స్పందించి వాస్తవాలను వివరించాలని కోరారు. అనంతరం గ్రామంలో గల చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తంచేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - మక్కువ; మండలంలోని విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని కావున ప్రజలు సహకరించాలని. ఏపీ ఈపీడీసీఎల్ . ఈ ఈ ఓ. కె. గోపాల్ రావు నాయుడు గురువారం తెలిపారు. మక్కువ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి దుగ్గేరు ఫీడర్ పైన, చెట్లు కొమ్మలు తొలగించబడును కావున ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగును కావున ప్రజలందరూ సహకరించగలరు. త్రీ ఫేస్ సప్లై ఉదయం నాలుగు గంటలకు ఇవ్వబడునని తెలిపారు

ప్రకృతి వ్యవసాయం మంచిది

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : ప్రస్తుత పరిస్థితులలో ప్రకృతి వ్యవసాయం చాలా ఉత్తమమని ఎంపీపీ బొంగు సురేష్ అన్నారు. గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రాబోయే ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని చేసి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పొందాలని

ఆయన అన్నారు. తరువాత సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి. పారినాయుడు మాట్లాడుతూ ప్రతి రైతు తన ఇంటికి సరిపడే కూరగాయలు ఆహార ఉత్పత్తులను ఆకుకూరలను పండ్ల మొదలుకొని ప్రకృతి వ్యవసాయంతోనే పండించాలని ఆయన అన్నారు. దానివలన భూమిని పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంభంగి రమేష్ వ్యవసాయ అధికారి జోత్స్న, మాస్టర్ ట్రైట్నర్ శ్రీరామ్, గ్రామ సంఘ అధ్యక్షులు అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శేషుకి నంది అవార్డు ఆనందదాయకం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం భాస్కర్ ఆడిటోరియంలో జాతీయ ప్రతిభా పురస్కారాలు-2025 గ్లోబల్ ఐకాన్ అవార్డ్స్, బంగారు నంది అవార్డ్స్ ఎంపిక కార్యక్రమంలో పట్టణానికి చెందిన రచయిత వంజరాపు శేషుకి సాహిత్యంలో కవిత, పాట ప్రక్రియలో తన ప్రతిభను కనబరచినందుకు మెగా హెల్పింగ్ ఫౌండేషన్ అధినేత్రి శిరీషా రెడ్డి బంగారు నంది అవార్డుకి ఎంపిక చేసి ప్రముఖ నటులు బాబూ మోహన్, సీరియల్ నటులు మొగలిరేకులు ఫేమ్ షీలాసింగ్ ఏటో వెళ్లిపోయింది మనసు ఫేమ్ సూర్య ఇంకొంతమంది ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందదాయకమని మునిసిపాలిటీ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ బంటుపల్లి ఈశ్వరరావు కొనియాడారు. ఈ సందర్భంగా రచయిత శేషు ఇంట్లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. సేఫ్ షాప్ సభ్యులు గొబ్బూరు హారతి, గొడబ రమాదేవి, ముప్పిడి సురేష్ అభినందనలు తెలిపారు.

రాములోరి కల్యాణానికి శ్రీరామగిరి ముస్తాబు

విశాలాంధ్ర - వీఆర్ పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి వారి తిరు కల్యాణ మహెూత్సవానికి ఆలయాన్ని ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లు వేశారు. విద్యుత్ దీపాలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందేలా అలంకరణ చేశారు. ఈనెల 6వ తేదీన శ్రీరామ గిరిలో నిర్వహించే సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు నలుమూలల నుండి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వివిధ శాఖల అధికారులు ఆలయ కమిటీ తగు ఏర్పాట్లను చేస్తున్నారు.

నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలి: సీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదులు వద్ద నిఘా నేత్రాలను ఏర్పాటు చేయాలని పట్టణ సిఐ మురలీధర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ పోలీస్ స్టేషన్ నందు పట్టణ సిఐ మురలీధర్ పట్టణంలో వున్న ప్రార్థనాలయాల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసారు. పట్టణంలో 37 హిందూ దేవాలయాలు, 03 మసీదులు, 13 చర్చిలు, పట్టణంలో ఉన్న కూడళ్ళ వద్ద ముఖ్య వ్యక్తుల విగ్రహాలు 19 ఉన్నాయన్నారు. వీటన్నిటి రక్షణకు పీస్ కమిటీలు(05 మంది చొప్పున) ఏర్పాటు చేసి వారితో ప్రార్థనాలయాలు, స్టేట్యు(విగ్రహాలు) వద్ద నిఘా నేత్రాలను ఏర్పాటు చేయాలని తెలియజేసారు. వారితో నలువైపులా 04 సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని, వీటి వలన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు, అన్యమత రాతలు వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా వీటి ద్వారా జాగ్రత్తలు తీసుకోవచ్చు అన్నారు. ప్రార్థనాలయాల పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు సహకరించాలని స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు.అలాగే సినిమా హాల్లో వద్ద దేవాలయాలలోను రద్దీ ప్రదేశాలలో నగల షాపుల వద్ద బస్టాండ్‌ల వద్ద అపరిచిత వ్యక్తులు సెంటు వాసన చూపించి మత్తులోకి దించి నగలు నగదను అపహరించకుపోతారని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - బలిజిపేట: మండలంలో డ్రైనేజీ, రోడ్లు భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు అన్నారు. బలిజిపేట మండలంలో త్రాగటానికి మంచినీరు చాలా గ్రామాల్లో అందడం లేదని, ఈ మధ్యకాలంలో తుమరాడ, బర్లి, జనార్ధన వలస, గంగాడ, ఇతర గ్రామాలలో తాగడానికి నీరు లేక ప్రజల ఆందోళన చెందుతున్నారని అన్నారు. కాలువల్లో పూడికలు తీయక విపరీతంగా దోమలు ఉన్నాయని అన్నారు. మండలంలో ఇప్పటికే అనేక గ్రామాలు ఎల్ పి ఎం నెంబర్ లింకు ఉండడం వల్ల చాలామందికి వన్ బీలు రావట్లేదన్నారు. ఈయనతో పాటు సిపిఎం పార్టీ నాయకులు బొద్దాన భానుమూర్తి, యమ్మల మన్మధరావు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగునని ఈ సమా వేశానికి సర్పంచులు ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికా రులు హాజరు కావాలని ఎంపిడిఓ జి. రమేష్ తెలిపారు. వార్షిక సంవత్సరం ముగింపు సందర్భంగా సర్వసభ్య సమా వేశంలో ఇంతవరకు జరిగిన అభివృద్ధి, ఖర్చు చేసిన నిధులు, చేయాల్సిన కార్యాచరణపై తీర్మానాలతో పాటు చర్చ ఉంటుందని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించండి

విశాలాంధ్ర - బలిజిపేట: తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రామంలోనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేయాలని బలిజిపేట మండల విద్యాశాఖ అధికారి 1 సామల సింహాచలం కోరారు. గురువారం మండలంలోని పి.రావివలస గ్రామంలో పర్యటించి, నూతన విద్యార్థుల చేరికల కోసం విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను జాయిన్ చేయాలని స్థానిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి క్యాంపెయిన్ నిర్వహించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో నమోదైన విద్యార్థుల వివరాలను అంగన్వాడి కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఒకటో తరగతికి ముగ్గురు విద్యార్థులు ఉన్నారని తెలుసుకొని, ఆ విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారి పిల్లలను స్థానిక పాఠశాలలో జాయిన్ చేయుటకు దరఖాస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక హెచ్‌ఎం వెంకట నాయుడు, జోగయ్య, అంగన్వాడి కార్యకర్త జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ అటవీ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గురువారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం, రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వలసగెడ్డలో రామాలయం నిర్మాణం దాత హైదరాబాద్‌కు చెందిన ముక్తేశ్వరరావు ఆధ్వర్యాన వేదపండితులు కళ్యాణ గురుస్వామి, దామోదర స్వామిలు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గణపతి పూజ, సర్వదూపత్య హోమ్ం, పీఠన్యాసము, యంత్రన్యాసము వంటివి నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఏపీ రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసనంద సరస్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: అంతర్జాతీయ పారా అథ్లెట్ (బ్లైండ్)క్రీడాకారిణి కుమారి కిల్లక లలిత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆకాంక్షించారు. తాను సాధించిన విజయాలతో జిల్లాకు మంచి పేరు వచ్చిందని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లా పేరును ఇనుమడింప చేయాలని ఉద్బోధించారు. పారా అథ్లెట్ క్రీడాకారిణి కుమారి లలిత అభినందన కార్యక్రమం జిల్లా కలెక్టరు ఛాంబరులో గురువారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా ఆమెను దుస్సాలువతో కలెక్టర్ ఘనంగా సత్కరించి, రన్నింగ్ షూస్ ను బహూకరించారు. వైకల్యం శరీరానికే గాని మానసికంగా కాదని, ఇటువంటి వారిని ప్రోత్సహిస్తే, ఇతర క్రీడాకారులకు తీసిపోరని కలెక్టర్ కొనియాడారు.ఆమె మరిన్ని విజయాలు సాధించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. గుమ్మలక్ష్మిపురం మండలం గొల్లలంక గ్రామానికి చెందిన లలిత తల్లితండ్రులు బోర్జ, సీతమ్మలను కలెక్టర్ ముందుగా అభినందించారు. ఆమెలోని క్రీడా తపనను గుర్తించి, సరైన ప్రోత్సాహం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముందుగా ఆమె సాధించిన పతకాలను కలెక్టర్ పరిశీలించారు.జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కిల్లక లలిత క్రీడా ఆణిముత్యం అని కొనియాడారు. 2023లో హాంగ్‌జౌ, చైనాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో 100 మీటర్ల పరుగులో రజత పతకాన్ని, మొరాకోలోని మర్రకెచ్‌లో జరిగిన 7వ ప్రపంచ పారా అథ్లెటిక్ గ్రాండ్ ప్రిక్స్‌లో పాల్గొని వరుసగా 1500 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం లలో రెండింటిలోనూ 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నారని అన్నారు. అదే ఏడాది బెంగళూరులో జరిగిన 5వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో 1:10 నిమిషాల్లో 400 మీటర్లు, 6:18 నిమిషాల్లో 1500 మీటర్లు పరుగు పందెంలో విజయం సాధించి కాంస్య పతకం సాధించారని, 2025 మార్చి 11-13 వరకు న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో 400 మీటర్లలో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించినట్లు కలెక్టరుకు వివరించారు. 2018 నుంచి నేటి వరకు పతకాలు సాధించిన విషయాన్ని తెలిపారు.ఈ అభినందన కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం. మురళి మోహన్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు డి.టి.గాంధీ, క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు, పీడి,పీఈటి అసోసియేషన్ల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - పాచిపెంట: మండలంలో గల వివిధ గ్రామాల పరిధిలోగల వెనుకబడిన కులాల స్వయం ఉపాధి కొరకు దరఖాస్తులు చేసుకున్న వారికి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 50 యూనిట్లు మంజూరయ్యారు. వివిధ విభాగాల్లో రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ఉదయం 10 గంటల నుండి ద్రవపత్రాలను అధికారులు ఫ్రూట్ ని చేశారు. మండలంలో 189 మందిదరఖాస్తు దారులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూ ను ఎంపీడీవో బివిజె పాత్రో, ఎంపీపీ బి ప్రమీల, ఏపీ జీవీబ్యాంక్ మేనేజర్ లు సునీల్ కుమార్, సూర్య భాస్కర్, ఈవోపీఆర్డి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఎంపీడీవో

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని గుచ్చిమి, తాన్నసీతారాంపురం పలుగ్రామాల్లో గురువారంనాడు ఎంపీడీవో త్రివిక్రమరావు ఉపాధి హామీ పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు.వేతన దారులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పనులు చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి పథకాలను పరిశీలించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం సూరంపాలెం గ్రామం శివారున అటవీ ప్రాంతంలో గురువారం పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు,వారి వద్ద నుంచి రూ.18,680 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రాజవొమ్మంగి,సూరంపాలెం గ్రామాలకు చెందినవారు ఉన్నారని,రాజవొమ్మంగి ఎస్సై నరసింహామూర్తి తెలిపారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం:

డాక్టర్ శోభారాణి

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆసుపత్రి సూపరెండెంట్, గైనకాలజిస్టు డాక్టర్ శోభరాణి అన్నారు. గురువారం కురుపాం ఆసుపత్రిలో కురుపాం,గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన గర్భిణీలకు తనిఖీలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా గర్భిణీలు తీసుకోవాలసిన పౌషికాహారం,గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత లు, సాధారణ ప్రసవాల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. నొప్పులు భరించలేరని కొందరు, ముహర్తాల కోసం మరి కొందరు శస్త్రచికిత్సలపై ఆలోచిస్తున్నారన్నారు. దీనివలన భవిష్యత్లో వచ్చే అనార్ధలపై అవగాహన పరి చారు. కురుపాం ఆసుపత్రిలో 90శాతం సాధారణ ప్రసవాలు నిర్వహిస్తున్నమ న్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ జి.ఈశ్వరమ్మ,స్టాఫ్ నర్సులు,గర్భిణీలు పాల్గొ న్నారు.

బీసీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ లబ్ధిదారులకు గురువారంనాడు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు తెలిపారు. మండలానికి 107యూనిట్లు మంజూరు కాగా సుమారు 600 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. బ్యాంకు మేనేజర్లు సమక్షంలో లబ్ధిదారులను ఇంటర్వ్యూలు చేయడం జరిగిందని, ధ్రువీకరణ పత్రాలను కూడా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 35 గ్రామ పంచాయతీలకు చెందిన లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు దగ్ధం

విశాలాంధ్ర -కొయ్యూరు: మండల కేంద్రమైన కొయ్యూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వంజరి ఆంజనేయులకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో తాటాకు ఇల్లు పూర్తిగా ఖాళీ బూడిదయ్యింది. దీంతో ఇంట్లో ఉన్న పది బస్తాల ధాన్యం రెండు బస్తాల జీడిపిక్కలు, 50 వేల రూపాయల నగదు రెండు తులాల బంగారం, రేషన్ కార్డులు ఆధార్ కార్డులు సర్వం అగ్నికి ఆహుతి అయ్యాయి. నిరుపేదైన ఆంజనేయులు ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోవడంతో నిరాశ్రయులు అయ్యారు. అయితే సంఘటనా స్థలాన్ని సర్పంచ్ మా కాడ బాలరాజు విఆర్ఓ పరిశీలించి ప్రభుత్వ నుండి రావలసిన రాయితీలు గురించి అధికారులు దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

సీతానగరం సాగునీటి సంఘం అధ్యక్షులు తెంటు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర, సీతానగరం: మండలంలోని కాసాపేట గ్రామానికిచెందిన మాజీ జడ్పిటిసి, సీతానగరం సాగునీటి సంఘం అధ్యక్షులు తెంటు వెంకటఅప్పలనాయుడు పుట్టినరోజు సందర్భంగా గురువారం నాడు ఆయనకు మండలంలోని టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా లక్షాధికారి కావాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: జిల్లాలోని స్వయం సహాయక బృందాల్లోని ప్రతి మహిళ లక్షాధికారి కావాలని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఏపీడీలు, ఏపీఎంలను ఆదేశించారు. జిల్లాలో దాదాపు 2 లక్షల 30 వేల మంది మహిళా సభ్యులు ఉండగా, వారిలో సగానికి పైగా లక్ష లోపు వార్షికాదాయం ఉందని అన్నారు. అటువంటి వారిని గుర్తించి, వారితో అనుకూలంగా ఉండే వ్యాపారాలను చేపట్టి ప్రతి మహిళను లక్షాధికారునిగా తీర్చిదిద్దాలని అన్నారు. ఇందుకు ఎస్.హెచ్.జీ నిదులే కాకుండా డీఆర్డిఎ - వెలుగు సంస్థల నుంచి సహకారం పొందవచ్చన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళా వ్యాపారవేత్త రావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆర్థిక సం.లో ఎంత మంది లక్షాధికారులు, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉందో ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. అందులో ప్రతి నెలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఆ దిశగా ప్రగతిని కనబరచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధి హామీలో చెరువు గట్లపై కొబ్బరి, పనస వంటి మొక్కల పెంపకం చేసుకునేందుకు వీలుందని, ఫలసాయం నుంచి వచ్చే ఆదాయాన్ని మహిళలు ఆర్జించవచ్చని అన్నారు. గ్రామ పంచాయతీ చెరువుల్లో చేపల పెంపకం చేపట్టవచ్చని, తద్వారా చెరువులు బాగుపడటంతో పాటు మత్స్యసంపద వలన అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్వహణను ఆసక్తి ఉన్న మహిళలతో రుసుమును వసూలు చేస్తూ నిర్వహించుకునే సౌలభ్యం ఉందన్నారు. అలాగే పశు సంవర్ధక శాఖ ద్వారా గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం లభించగలదని కలెక్టర్ గుర్తుచేశారు. జీడి, పసుపు పంటల సాగుతో అధిక ఆదాయం వస్తుందని, జీడి పరిశ్రమకు అవసరమైన జీడి పిక్కలు కొనుగోలు, గిరి బజారు ద్వారా మహిళలు తయారు చేసిన వస్త్ర, ఇతర సామాగ్రి విక్రయాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.విద్యార్థులకు అవసరమైన స్కూల్ యూనిఫారాలను తయారుచేయడం ద్వారా అధిక ఆదాయం సమకూరుతుందని వివరించారు. మార్కెట్ లో ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తయారుచేసి విక్రయించడం వలన ప్రతి మహిళ లక్షాధికారి కావచ్చని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు తగిన శిక్షణ, ముందస్తు ప్రణాళిక కచ్చితంగా ఉండాలని తేల్చి చెప్పారు. ఆర్సేటి ద్వారా మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉచితంగా శిక్షణ పొందవచ్చని, మహిళా సంఘాలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకొని ప్రగతిని సాధించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - వెలుగు పథక సంచాలకులు సుధారాణి, వై.సత్యంనాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్,జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్.మన్మధరావు, ఐటీడీఎ ఏపీఓ మురళిమోహన్, ఏపీడీలు, ఏపీఎంలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మే 4 నుండి శ్రీ మత్స్య మాడుగులమ్మ జాతర

విశాలాంధ్ర - జి.మాడుగుల: మన్య ప్రజల ఆరాధ్య దైవం భక్తులు కోర్కెలను తీర్చే కొంగు బంగారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండల కేంద్రంలో గంతకొండ పై వెలసిన శ్రీ మత్స్య మాడుగులమ్మ తల్లి జాతర మహోత్సవాలను ఈ ఏడాది మే 4 నుండి 6 వరకు అతి వైభవంగా నిర్వహించుటకు గురువారం వేద పండితులు శర్మ ముహూర్తం ఖరారు చేసిన నేపథ్యంలో ఉదయం స్థానిక శ్రీ మాడుగులమ్మ ఆలయం వద్ద గ్రామ పెద్దలు సమక్షంలో ఉత్సవ కమిటీని ప్రకటించారు. ఇందులో భాగంగానే జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీని అందరి సమక్షంలోనే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులుగా మత్స్యరాస బాలరాజు, ఎం. మణికుమారి,వరహాల రాజు,ఎం.వెంకటలక్ష్మి, కిముదు రాంబాబు, ఎం.విజయ కుమారి,, వరహాలమ్మ, , ఎం మత్స్య రాజు మాస్టారు ,ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఎం రామరాజు, ప్రధాన కార్యదర్శిగా గసాడి రెడ్డిబాబు,ఉపాధ్యక్షులుగా .నాగరాజు,ఎం.వి.జి.రాజు, ఎం సింహాచలం రాజు ఎం లక్ష్మీపతి రాజు. కిముదు సింహాచలం, కోశాధికారిగా ఎం మత్స్యరాజు(ఎస్ ఎస్ ఎఫ్) సహాయ కోశాధికారిగా వడ్డాది శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులుగా ఎం భగవాన్ రాజు, కే కోటేశ్వరరావు, ఎం సత్యనారాయణ రాజు,ఎం.గణేష్ రాజు,ఎం.చిన్న.(వెంకట రాజు) కే ప్రదీప్ చందు, అరుణ్ కుమార్, సాక్షి వెంకటరమణ,,టి. సత్యనారాయణ (ఈనాడు) జ్యోతి కొండబాబు అమీర్ జాన్ కే శ్రీను, శేఖర్, గుప్తా, గొర్లి గణేష్ ,డి.ఈశ్వరరావు, మల్ల గిరిధర్ సాయి ,వంతల గణపతి, కిముదు కళ్యాణం, కొండబాబు, వానపల్లి జగదీష్, కొమ్మోజి సత్తిబాబు, ప్రచార కమిటీ ఎస్. కోటేశ్వరరావు, ఆలయ అలంకరణ ఉమా సత్తిబాబు,తో ఎస్ కే రెహమాన్ మాజీ సర్పంచ్, 30 మంది కార్యవర్గ సభ్యులు గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు,కార్యదర్శిలు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను గ్రామస్తులు, పెద్దలు సహకారాన్ని తీసుకొని భారీ ఎత్తున నిర్వహిస్తామని వారన్నారు. ఈ ఉత్సవాలు విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.జి.రాజు,మత్స్యరాస మత్స్యరాజు,,సింహాచలం రాజు, అర్జున్ రావు వాన పల్లి కృష్ణ,, , వేణుబాబు, ధర్మారావు, ,గ్రామస్థులు, ఉద్యోగులు,వ్యాపారులు, యువకులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ యూత్ అధ్యక్షులుగా ఎం నారాయణ రాజు, కార్యదర్శిగా ఎస్ రామకృష్ణంరాజు. కె.వి,కూడా విజయ్, వెంకట్, చిన్న రాజు, గోపాల రాజు, భార్గవ రాజు, కూర్మరాజు, రైతురాజు,నాయుడు, రాహుల్ రామకృష్ణ, విక్రమ్ పవన్ కళ్యాణ్,తో పాటు మరో 20 మందిని యూత్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

396 కేజీల గంజాయి స్వాధీనం
నిందితులు పరారీ, వాహనాలు సీజ్

విశాలాంధ్ర - సాలూరు: పాచిపెంట మండలం ఆలూరు గ్రామ సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద రెండు వాహనాలలో తరలిస్తున్న 396 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకితా సురానా తెలిపారు. గురువారం సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా సాగుతుందని ముందుగా అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం 4 గంటల ప్రాంతంలో పాచిపెంట మండలం ఆలూరుకు రూరల్ సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసుల బృందం వెళ్ళారు. పోలీసుల రాకను గమనించిన గంజాయి రవాణాదారులు తమ వాహనాలను వెనక్కి తిప్ప సాగారు. పోలీసులు వెంబడించడంతో గంజాయి రవాణా చేసే వారు ఒక బొలెరో, ఆల్టో కారును విడిచి వారంతా పరారయ్యారు. వాహనాలలో ఉన్న గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో 39 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. గడిచిన మూడు నెలల వ్యవధిలో సాలూరు సర్కిల్ పరిధిలో సుమారు 1500 కేజీల గంజాయిని పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్, అర్బన్ సీఐలు రామకృష్ణ, అప్పలనాయుడు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమిష్టి కృషితో జిల్లా వైద్యారోగ్యశాఖకు గుర్తింపు తీసుకురావాలి

డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విశాలాంధ్ర - బెలగాం : అంకితభావంతో పనిచేసి మెరుగైన ఫలితాలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, సిబ్బందికి గురువారం సమావేశం నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లాలో చేపడుతున్న ప్రతీ కార్యక్రమానికి సంబంధించిన ప్రగతి నివేదికలను ఎప్పటికపుడు సిద్ధం చేసి సకాలంలో అందజేయాలన్నారు. మాతా, శిశు వైద్య సేవలు, టీకా నిర్వహణ, అసంక్రామిక వ్యాధుల సర్వే (ఎన్సిడి), టిబి, లెప్రసీ, స్కూల్ హెల్త్, స్వచ్ఛ ఆంధ్ర తదితర ఆరోగ్య కార్యక్రమాలు జిల్లాలో పకడ్బందీగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేసి, సంబంధిత పోర్టల్స్, యాప్‌ల నమోదు తీరును పరిశీలించాలని ప్రోగ్రాం అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డా ఎం. నారాయణరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డా. పిఎల్. రఘుకుమార్, డా. ఎం. వినోద్ కుమార్, సూపరింటెండెంట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ముడుపుల పూజలకు అనూహ్య స్పందన

విశాలాంధ్ర,సీతానగరం: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గురువారం జరిగిన ముడుపుల పూజలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముడుపుల పూజలను చేశారు. ఆలయ ప్రధానఅర్చకులు పీసపాటిశ్రీనివాసాచార్యులు,పీసపాటి రామానుజాచార్యులు టిటిడి పారాయణ కర్త కె .శ్రీనివాసరావులఆధ్వర్యంలో ఈపూజలను నిర్వహించారు.భక్తులుతెచ్చిన వివిధరకాల పూలదండలు,పూలు, కొబ్బరికాయలు అరటిపల్లు,కుంకుమ, పసుపుతో స్వామివారి ప్రధానగుడి కళకళలాడింది.ప్రతీగురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలోజరుగుతున్న ఈముడుపుల పూజలకు పాతభక్తులతోపాటుకొత్త భక్తులురాకతో ఆలయం కిటకిటలాడింది. వేసవి ఎండల దృష్ట్యా మొదటి పూజా కార్యక్రమాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా కిటకిటలాడింది. భక్తులు ప్రైవేటు వాహనాల్లో పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.నిర్మలమైన మనస్సుతో భక్తులు 27సార్లు ఆలయంచుట్టూ ముడుపులు పట్టుకొని ఓంశ్రీలక్ష్మి నరసింహస్వామి అంటూ ప్రదక్షిణలను చేస్తూ స్వామివారికి పూజలు చేస్తున్నారు.తీర్థప్రసాదాలు స్వీకరించి తరలి వెళ్తున్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి తోపాటు శ్రీవేణుగోపాలస్వామిని భక్తులు దర్శించుకుంటారు.గురువారం జరిగిన ముడుపుల పూజలకు ఆలయధర్మకర్త చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతిదంపతులు, జిల్లాలోని పలువురు అధికారులు, వ్యాపారవేత్తలు కూడా

విచ్చేసి ముడుపుల పూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానఅర్చకులతో పాటు పవన్ ఆచార్యులు, మురారి, మనోజ్ ఆచార్యులు ,కృష్ణమోహన్ ఆచార్యులు, దగ్గరుండి పూజలు చేయించడంతోపాటు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసారు. ఆలయం లోపల, వెలుపల భక్తులతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన దుకాణాల సముదాయంలు కిటకిట లాడాయి.

ప్రకృతి సిద్దమైన ఆర్గానిక్ పంటలపై దృష్టి పెట్టాలి

ఐటిడిఎ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర- సీతంపేట:పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్గానిక్ పంటలపై దృష్టి పెట్టాలని ఐటిడిఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన నాలుగు మండలాల అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు మరియు ఆర్ట్స్, వెలుగు, ఏపీసీన్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశమై ఆర్గానిక్ పంటలపై చర్చించారు.ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ పంటలను ఆర్గానిక్ పద్ధతుల ద్వారా పండించడం వల్ల పంటకు అధిక ధర వస్తుందని అన్నారు. సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో జీడిపంటపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి ఆర్గానిక్ ద్వారా పండించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్గానిక్ పద్ధతుల ద్వారా పండించడానికి పాటించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో. ఏడీ అగ్రికల్చర్, పీహెచ్ వో వెంకట గణేష్, ఏవోలు హెచ్ వోలు, ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు, వెలుగు డైరెక్టర్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.